## క్లుప్తంగా

### ఘనంగా గ్యార్మీ మహోత్సవం



**తెనాలిఅర్బన్:** హజరత్ మాబు సుభానీ గ్యార్మీ జెండా పండుగ మహోత్సవాన్ని 26వ వార్డు పాండురంగపేటలోని జెండా చెట్టు వద్ద వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ షేక్ ఇస్మాయేల్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దల నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు. షేక్ బాజీ, షేక్ సైఫ్, షాదుల్లా, రఫీ, సైఫ్ ఆలీ, బాజీ, సల్మాన్, మున్నా, రియాజ్, పండు, బుడే, ఖజీ, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

### మురుగు కాల్వల్లో చెత్త వేయవద్దు



**తెనాలిఅర్బన్:** మురుగు కాల్వల్లో చెత్త వేయకుండా శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పట్టణంలోని గాంధీచౌక్ నుంచి మెయిన్ రోడ్డు, స్వరాజ్‌టాకీస్ వరకు ఉన్న సైడ్ డ్రెయిన్స్‌ను ఆదివారం పరిశీలించారు. వాటిలో వ్యర్థాలను తీయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాల్వల్లో చెత్తను వేయడం వలన పారుదల నిలిచిపోతుందని చెప్పారు. షాపులో ఉత్పత్తి అయిన చెత్తను వ్యాపారులందరూ బుట్టలో వేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ తోట రఘురామ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాజీ హుస్సేన్, తదితరులు ఉన్నారు.

### నేటి నుంచి అయ్యప్ప పడిపూజ మహోత్సవం

**తెనాలిటౌన్:** స్వామి అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో సోమవారం నుంచి డిసెంబర్ 26 వరకు 31 రోజులపాటు మారీసుపేట మతంబ జార్‌రులో ప్రతిరోజు సాయంత్రం ఆరుగంటలకు అయ్యప్పస్వామి పూడిపూజ మహోత్సవం జరుగుతుందని భక్త బృందం సభ్యులు ఆదివారం తెలిపారు. పడిపూజ మహోత్సవం అనంతరం రాత్రి 8.30 గంటలకు మాల ధరించిన స్వాములకు భిక్ష ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయ్యప్ప మాల ధరించిన స్వాములందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

### జూదరులు అరెస్టు

**తెనాలిరూరల్:** ఓ అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించగా జూదరులు పట్టుపడ్డారు. పట్టణ నాజరు పేటలోని అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నారని వన్‌టౌన్ సీఐ కె.చంద్రశేఖర్‌కు ఆదివారం రాత్రి సమాచారం అందటంతో తమ సిబ్బందితో ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడిలో ఏడుగురు జూదరులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.36,860 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### 28 నుంచి 'పల్లెకుపోదాం'

**తెనాలిటౌన్:** మండల గ్రామాల్లో ఈ నెల 28 నుంచి రెండో విడత పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ వి.ప్రతాపరెడ్డి ఆదివారం తెలిపారు. ప్రతి రోజు మధ్యాహ్నం మూడు గంటలకు గ్రామాల్లోని సచివాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తారని చెప్పారు. గ్రామాల వారీగా ఈ నెల 28 గుడివాడ, 29న కఠెవరం-1, 30న కొలకలూరు-1, డిసెంబర్ 1న కొలకలూరు-2, 4న కొలకలూరు-3, 5న నందివెలుగు-1, 6న నందివెలుగు-2, 7న పెదరావూరు-2, 8న తేలప్రోలు, 11న పెదరావూరు-1 సచివాలయంలో సమావేశం జరుగుతుందన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

### సంక్షేమ పథకాలపై ప్రచారం



**వల్లభాపురం(కొల్లిపర):** వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని వల్లభాపురం, అత్తలూరివారిపాలెం పంచాయతీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై శాఖల పరంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించి, వాహనం ద్వారా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ వల్లభాపురం నిర్మల, ఉపసర్పంచ్ అవుతు పోతిరెడ్డి, మండల వైద్యాధికారి వేముల ప్రియాంక, ఎంపీడీఓ వి.విజయలక్ష్మి, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఐసీడీసీ సూపర్‌వైజర్ నాగమణి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేడ్కర్ ఆశయాల సాధనకు సీఎం జగన్ కృషి

- రాజ్యాంగ ఆమోద దినోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్
- భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘననివాళి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్యే శివకుమార్

**తెనాలి:** ప్రపంచ దేశాల్లో భారతదేశం గొప్ప ప్రజాస్వామ్య దేశంగా విరాజిల్లుతోందని, ఇందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే ముఖ్యకారణమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం రోజైన ఆదివారం స్థానిక రైల్వేస్టేషను సెంటరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వేడుకను నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీనేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజును రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకొంటున్నట్టు తెలిపారు. భిన్న మతాలు, కులాలు కలిగిన దేశం, లౌకికదేశంగా ప్రజాస్వామ్యం పరిఢవిల్లటానికి మన దేశ రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలే ప్రధాన కారణమన్నారు. అంబేడ్కర్ సిద్ధాంతాలను రాజ్యాంగానికి అనుగుణంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అనుసరిస్తున్నారని చెప్పారు. అందరికీ చదువు, సామాజిక న్యాయం కల్పించే దిశగా రాష్ట్రంలో పాలన సాగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్, తాడిబోయిన రమేష్, ఈడ్గా అధ్యక్షుడు గౌస్ కాళిదాసు విజయసత్యం, పిన పాటి అనిల్, కఠారి హరీష్, మున్సిపల్ కౌన్సిలర్లు మొగల్ అహ్మద్, షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగరాజు



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు

**జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో...**

**తెనాలిటౌన్:** గంగానమ్మపేటలోని జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో ఆదివారం రాజ్యాంగ అమలు దినోత్సవ వేడుకలను జరిపారు. ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కఠెవరపు దేవయ్య (దేవానంద్) మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం 1949 నవంబర్ 26 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. దళిత, బహుజన, గిరిజన ప్రజలు ఎన్నో రకాల రాజ్యాంగ ఫలాలను పొందుతుంటే వాటినుంచి దూరం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ప్రజలు గమనించి రాజ్యాంగ పరిరక్షణకు పాటు పడాలని కోరారు. ఫెడరేషన్ సలహాదారు కె.అబ్రహాం లింకన్, కొత్తపల్లి రామారావు, భూషణంలు పాల్గొన్నారు.

**మున్సిపల్ కార్యాలయంలో..**

**తెనాలి:** పట్టణ మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని జరిపారు. దేశప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం అందిస్తూ రూపొందించిన రాజ్యాంగాన్ని గౌరవిస్తూ బాధ్యత గల పౌరులుగా మెలగాలని కోరుతూ జరిగిన వేడుకల్లో సంబంధిత ప్రతిజ్ఞ చేశారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎస్ఎల్ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, వై.లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్ జీవీ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ షేక్ బషీర్, సిబ్బంది పాల్గొన్నారు.

**బలహీనవర్గాల ఆయుధమే రాజ్యాంగం..**

**తెనాలిరూరల్:** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక తెనాలి దేవిచౌక్‌లోని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కార్యాలయంలో కార్మికులకు రాజ్యాంగం గురించి మానవ హక్కుల గురించి అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వాహించారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ముసాయిదా కమిటీకి బాధ్యత వహించి భారత రాజ్యాంగాన్ని బడుగు బలహీన వర్గాల సామాన్యుల కోసం, వారి అభ్యున్నతి కోసం వారి జీవితం కోసం రచించారని పేర్కొన్నారు. సామాన్యులకి ఓటు హక్కు ద్వారా, రిజర్వేషన్ల ద్వారా ఎంతో శక్తివంతమైన ఆయుధాన్నిచ్చారని కొనియాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు వేదిక జిల్లా అధ్యక్షుడు కృష్ణ, సీపీఎం నాయకుడు బాబు ప్రసాద్, ప్రజాస్వామ్య ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు బ్రహ్మానంద రెడ్డి, వేదిక జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రేమ్ సాగర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం

**తెనాలిటౌన్:** పట్టణ 3వ వార్డు భాస్కరరావు కాలనీలో ఆదివారం మంచాల శ్రీనివాస్ (శిల్పాల శ్రీను) ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం వైభవంగా జరిగింది. గురుస్వామి దుర్గా హరిబాబుస్వామి పర్యవేక్షణలో పూజలు జరిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూజలు జరిపి, స్వామికి అభిషేకం చేశారు. అయ్యప్పస్వామి మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే శివకుమార్‌ను నిర్వాహకులు శాలువాలు, పూలమాలతో సత్కరించారు.

### కార్తిక కోటి దీపోత్సవం



**తెనాలిటౌన్:** కార్తీకపౌర్ణమి సందర్భంగా శివాజీ చౌక్ వద్ద ఉన్న కాళీమాత దేవాలయ ఆవరణలో కోటి దీపోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ పాల్గొని దీపాలను వెలిగించారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్తీకమాస విశిష్టత గురించి తెలిపారు. దేవస్థానం చైర్మన్ గుమ్మడి రమేష్, కందేపి సీతారామయ్య, యర్రా శ్రీనివాసరావు, శాఖమూరి సురేంద్ర, చలపతిరావు, భక్తులు పాల్గొన్నారు.

# కార్తిక వన సమారాధనల సందడి

**తెనాలిటౌన్:** కార్తీకపౌర్ణమి సందర్భంగా ఆదివారం పట్టణంలో పలు సంఘీయుల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనలను వైభవంగా నిర్వహించారు. వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో పాత రాజ్యంటాకీస్‌లో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం వేద పండితులు శాంతి ప్రవచనం చేశారు. అనంతరం గణపతిపూజ, శివలింగానికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళలు సామూహిక లలిత సహస్రనామ స్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. తులసీ ధాత్రిపూజ, కార్తీక దామోదర పూజలు చేశారు. పట్టణ పరిసర గ్రామాలకు చెందిన బ్రాహ్మణ సంఘీయులు పాల్గొన్నారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ, కోశాధికారి దక్షిణామూర్తి, ఉపాధ్యక్షులు కామేశ్వరరావు, సీతారామాంజనేయశాస్త్రి, తిరుమలరావు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

– పద్మశాలీయ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన పట్టణ ఐతానగర్‌లోని సాయిబాబా దేవస్థాన ప్రాంగణంలో జరిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార పాల్గొన్నారు. అనంతరం లక్కీడీప్ ద్వారా తీయించిన బహుమతులను అందజేసి ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం నోరి నారాయణమూర్తి కార్తీకమాస విశిష్టత గురించి ప్రవచనము చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, సెక్రటరీ సుబ్బారావు, కోశాధికారి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు బాలచంద్రమౌళి, సభ్యులు పాల్గొన్నారు.



వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య నిర్వహించిన వనసమారాధనలో పాల్గొన్న బ్రాహ్మణ సంఘీయులు

– రూరల్ మండలం అంగలకుదురులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. కుటుంబ సభ్యులకు వివిధ రకాల ఆటల పోటీలు జరిపారు. బహుమతులను అందజేశారు. జాతీయస్థాయి వెయిట్ లిఫ్టర్ నాగం జ్ఞానదీప్తిని సత్కరించారు. గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కన్నెగంటి మురళికృష్ణ, పావులూరి రాంబాబు, నల్లూరి వెంకటేశ్వరరావు, జగదీశ్వరాంబ తదితరులు పాల్గొన్నారు.

– కొత్తపేటలోని తాలూకా జూనియర్ కాలేజ్ ప్రాంగణంలో కృష్ణబలిజ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని మాట్లాడారు. కార్తీక వనసమారాధన విశిష్టతను తెలియజేశారు.



పద్మశాలీయ వనసమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

– బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆర్యవైశ్య కార్తీక వనసమారాధన నిర్వహించారు. సభ్యులకు ఆటల పోటీలు నిర్వహించారు. లక్కీడీప్ ద్వారా విజేతలను పేర్లను ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్ ప్రకటించారు. సంఘీయులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంజనేయులు, వాణిజ్య విభాగం వైస్ చైర్మన్ రాజేష్, రాజకీయ కమిటీ వైస్‌చైర్మన్ ఆలపాటి శివనరసింహారావు, వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు చుండూరు సాయి, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, శంకర నారాయణ, పలువురు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

# 'మానవత' సేవలు శ్లాఘనీయం

**తెనాలి:** మానవత స్వచ్ఛంద సేవాసంస్థ తెనాలి శాఖ సర్వసభ్య సమావేశం స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో ఆదివారం నిర్వహించారు. సంస్థ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. మానవత సంస్థ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలకు స్పందించి, పలువురు స్వచ్ఛందంగా సభ్యులుగా చేరుతుండటం శుభపరిణామంగా చెప్పారు. సంస్థ రాష్ట్రశాఖ ఆశయాల ప్రకారం వివిధ జిల్లాల్లో అనుసరిస్తున్న స్వచ్ఛంద సేవతో పాటు, స్థానికంగా అవసరమైన సేవలను అందిస్తున్నామని గుర్తుచేశారు. ఇటీవల ప్లాస్టిక్ సంచుల నివారణలో భాగంగా కాటన్ సంచులను తయారుచేయించి, ఉచితంగా పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. ఇదే నెలలో కాలేజీ విద్యార్థులకు ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించినట్లు చెప్పారు. భవిష్యత్ కార్యాచరణపై పలువురు సభ్యులు వివిధ సూచనలు చేశారు. వీటన్నిటిని పరిగణనలోకి తీసుకుని, కార్యాచరణను ప్రకటిస్తామని సంస్థ బాధ్యులు వెల్లడించారు. ఇదిలా వుంటే సర్వసభ్య సమావేశంలో వివిధ రంగాల్లో సేవలందిస్తూ, ప్రతిభను ప్రదర్శిస్తున్న యువతీ యువకులను అచీవర్స్‌ను ఇదే వేదికగా సత్కరించారు. శాస్త్రీయ నృత్యంలో విశేష ప్రతిభను ప్రదర్శిస్తున్న వర్ధమాన నటి, బీటెక్ విద్యార్థిని మన్నె టీనాచౌదరి, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థతో సామాజిక సేవ చేస్తున్న షేక్ ఇనయతుల్లా, క్రికెట్ శిక్షణనిస్తూ, ఎందరో క్రీడాకారులను వెలుగులోకి తెస్తున్న యువ క్రికెట్ అకాడమీ నిర్వాహకుడు కరిముల్లా మాలిక్‌లను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. తన్నీరు శ్రీనివాసబాబు, వజ్రాల రామలింగాచారి, జి.నాగేశ్వరరావు, డీవీ సోమయ్యశాస్త్రి, పి.వెంకట్, మొవ్వా సత్యనారాయణ, చిట్టినేని సాంబశివరావు, రాఘవరెడ్డి, కటకం ప్రసాద్, సీహెచ్ సాంబశివరావు, పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, తెనాలి అధ్యక్షుడు నరసింహారావు పాల్గొన్నారు. సంస్థ తరపున చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.



ఇనయతుల్లా, టీనాచౌదరి, మాలిక్‌లను సత్కరించిన మానవత బాధ్యులు

# ఇసుక ట్రాక్టర్ల పై కేసు నమోదు

**కొల్లిపర:** మండలంలోని మున్నంగి గ్రామ సమీపంలోని కృష్ణా నది నుంచి శనివారం రాత్రి అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను అత్తోట గ్రామంలో పట్టుకున్నట్లు తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎ.వి.చలం తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మట్లాడుతూ ఉన్నత అధికారల ఆదేశాల మేరకు కొల్లిపర మండలంలో ఇసుక అక్రమ రవాణాపై దాడులు నిర్వహించగా చొప్పర అశోక్, కొండూరు సురేష్, కొమ్మారెడ్డి బాలకిషోర్‌రెడ్డి అను ముగ్గురు వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా మూడు ట్రాక్టర్‌లలో ఇసుక తరలిస్తుండగా అత్తోట గ్రామం వద్ద వారిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలించటం నేరం అని, అటువంటి వారిపై కేసులు నమోదు చేయటం జరుగుతుందని హెచ్చరించారు.



ఇసుక ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేస్తున్న తెనాలి ఎస్ఈబీ ఎస్ఐ ఎ.వి.చలం

### ఐకమత్యంగా క్రమశిక్షణతో ఎదగాలి

ఎన్‌సీసీ దినోత్సవంలో కేర్‌టేకర్ విజయ్‌సింహా



ప్రతిజ్ఞ తదుపరి సెల్యూట్ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

**తెనాలి:** పట్టణ అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని క్యాడెట్లు నిర్వహించారు. టగ్ ఆఫ్ వార్, కర్చీఫ్ గేమ్‌లో పోటీలు జరిగాయి. ఇదేరోజు కాన్స్టిట్యూషనల్ దినోత్సవం సందర్భంగా ఎన్‌సీసీ కేర్ టేకర్ విజయ్‌సింహా ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఎన్‌సీసీ మోటోలోని ముఖ్యాంశాలైన యూనిటీ, డిసిప్లిన్ అని విజయ్‌సింహా గుర్తుచేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లు అందరూ ఐకమత్యంగా ఉంటూ క్రమశిక్షణతో ఎదగాలని సూచించారు. విశ్రాంత సైనికుడు పసుపులేటి మోహనరావు క్యాడెట్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్‌సీసీ సీనియర్ క్యాడెట్లు నఫీసా, వర్షిత, బద్రీనాద్‌లు అందరికీ స్వీట్లు పంచారు. హమ్ సభ భారతీయ హై అనే ఎన్‌సీసీ గీతంతో కార్యక్రమాన్ని ముగించారు.

# సత్యనారాయణస్వామి వ్రత మహోత్సవాలు

**తెనాలి:** స్థానిక వైకుంఠపురంలోని లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా భక్తులు పోటెత్తారు. శ్రీవారిని దర్శించుకున్నారు. కార్తికమాసం సందర్భంగా ప్రతి వారం నిర్వహిస్తున్న శ్రీరమాసహిత శ్రీసత్యనారాయణస్వామి వ్రత మహోత్సవాలు రెండోఆదివారం కూడా నిర్విఘ్నంగా జరిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు పర్యవేక్షణలో జరిగిన వ్రతాల్లో వందమంది దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వ్రత విశిష్టతను భక్తులకు తెలియజేశారు. వ్రతాన్ని ఆచరింపజేశారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. దంపతులతోపాటు దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీచేశారు.



సామూహిక వ్రతమాచరిస్తున్న దంపతులు

### క్రీస్తు పుట్టుక లోకానికి వెలుగు



**తెనాలి:** ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థన కొండ చర్చిలో ఈనెల 25వ తేదీనుంచి డిసెంబరు 25వ తేదీవరకు క్రిస్మస్ మాసం ప్రారంభం సందర్భంగా ఆదివారం ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. సంఘకాపరి, పాల్ అండ్ లూక్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బ్రదర్ ఆనందన్న క్రిస్మస్ సందేశాన్ని అందించారు. క్రీస్తు పుట్టుక లోకానికి వెలుగని, క్రీస్తు జననంతో ఈ లోకంలో శాంతి నెలకొందని చెప్పారు. ఆరాధనలో సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

### వైభవంగా గంగానమ్మ కొలుపులు



**తెనాలి:** పట్టణ గంగానమ్మపేటలోని గంగానమ్మ గుడిలో ఆదివారం అమ్మవారి కొలుపులు వైభవంగా జరిగాయి. కొలుపుల సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలను చేశారు. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు తెల్లవారుజామున 5 గంటల్నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. క్యూలైనులో నిలబడి గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు మహిళలు పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. కొన్ని ప్రాంతాల్నుంచి భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన ప్రభలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పూజలు చేశారు. సాయంత్రం వరకు కొలుపుల వేడుకలు కొనసాగాయి.

### పథకాలపై అవగాహన కల్పించాలి

సీనియర్ సివిల్ జడ్జి నాగరాజా

**మంగళగిరి:** పిల్లలు, దివ్యాంగులు, మానసిక వ్యాధిగ్రస్తుల కొరకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని, పథకాలపై ఆయా వర్గాలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి నాగరాజా కోరారు. పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో పీఎల్‌వీ లా శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని వేల కోట్లు ఖర్చు చేస్తున్నాయని ఈ పథకాల అమలుకు ఆయా వర్గాల వారిని స్వయంగా కలిసి వారికి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు లెనిన్, రాజేష్, రాజ్యలక్ష్మి, స్వరూపారాణి, పీఎల్‌వీ మల్లవరపు రామ్మూర్తి, దయ్యాల నరసయ్య, లోక్ అదాలత్ ఇన్‌చార్జి ఉండవల్లి సుభాషిణి పాల్గొన్నారు.

### భవానీమాతకు విశేష పూజలు

**ఫిరంగిపురం:** మండలంలోని వేములూరిపాడులోని జలపాలేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భవానీ మాలధారులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉమాపతి శాస్త్రి భవానీ పీఠం వద్ద మండపారాధన, విశ్వక్సేనపూజ, అఖండ దీపారాధన, కలశ స్థాపనలు చేసి భవానీమాతకు అష్టోత్తర, సహస్ర నామ కుంకుమపూజలు చేశారు. భవానీ మాలదారులు పలువురు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

# మంచి పుస్తకాల ఆవిష్కరణ

**నగరంపాలెం:** సాహిత్య ప్రమేయం లేని సమాజం అనారోగ్యానికి గురవుతుందని అరసం నేత, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. బృందావన్‌గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో ఆదివారం మంచి పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. పులుపుల వెంకటశివయ్య గేయాలు- వ్యాసాలు పుస్తకాన్ని ఓబులేసు, తాపీ ధర్మరావు- జీవితం- రచనలను సాహితీవేత్త డాక్టర్ పాపినేని శివశంకర్, కుందుర్తి కవితా ప్రస్థానం పుస్తకాలను అరసం రాష్ట్ర కార్యదర్శులు కె.శరత్ చంద్ర, జ్యోతిశ్రీ ఆవిష్కరించారు. సాహితీవేత్త డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ ప్రాచీన, ఆధునిక సాహిత్యాలకు వారధి తాపీ ధర్మరావు అన్నారు. నేటితరం సాహిత్యకారులు విధిగా ప్రాచీన సాహిత్యాన్ని కూడా అధ్యాయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేటి తరానికి అభ్యుదయ సాహిత్యాన్ని చేరువ చేసేందుకు ప్రచురణలు కొనసాగిస్తూ, డిజిటల్ ఛానెల్ ద్వారా కూడా సాహిత్య కార్యకలాపాలను సమాజానికి చేరువ చేస్తున్నామని అన్నారు. సభకు ఏపీ అరసం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అధ్యక్షత వహించగా మాట్లాడారు. అనంతరం ఉమ్మడి జిల్లా అరసం కార్యవర్గాన్ని ప్రకటించగా, గౌరవాధ్యక్షునిగా కారసాని రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడిగా చెరుకుమల్లి సింగా, ఉపాధ్యక్షులుగా డాక్టర్ గొట్టిముక్కల స్వర్ణలత, గోలి సీతారామయ్య, కనపర్తి బెనహర్ నియమితులయ్యారు.



మంచి పుస్తకాల ఆవిష్కరణలో ఓబులేసు, శివశంకర్, లక్ష్మీనారాయణ తదితరులు

### గుంటూరు తరలిన రజక సంఘీయులు



రజక సంఘీయులతో ఎంపీపీ చెన్నకేశవులు

**తెనాలిఅర్బన్:** గుంటూరులో ఆదివారం జరగనున్న రజక ఆత్మగౌరవ మహాసభకు తెనాలి నుంచి రజక సంఘీయులు పెద్ద సంఖ్యలో వెళ్లారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాలకు ఆయన జెండా ఊపారు. కార్యక్రమంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ ఓలేటి శివాజీ, కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి, మల్లికార్జునరావు, మునిపల్లి వంశీ, పెసర్లంక రమణ, సూరిబాబు పాల్గొన్నారు.